## క్లుప్తంగా

### గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి



పాతూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, పాఠకులు

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆదివారం పాతూరి నాగభూషణం 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి పాతూరి నాగభూషణం విశేష కృషి చేశారన్నారు. విజయవాడలో గ్రంథాలయ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనేక మంది లైబ్రేరియన్లను తయారు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు గోవిందరెడ్డి, బాషా, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిలో పాటలు పాడుతున్న హేమ మాలిని

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ఆదివారం నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయని బుర్రా హేమ మాలినిచే నిర్వహించిన విభావరిలో వయోలిన్ సహకారం రాధశ్రీ లాస్య, మృదంగం బి.సుధాకర్ అందించారు. త్యాగరాజు కృతులు, అన్నమయ్య కృతులతో పాటు రామదాసు కృతులను ఎంతో హృద్యంగా ఆలపించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, జనార్దన, వెంకటకృష్ణ, వీరయ్య, రవి, శ్రీనివాస్, లలిత, వేదవతి, సునీత, తిరుమల తిరుపతి దేవ స్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన సీఐ



వి.కిరణ్ కుమార్‌రెడ్డి

కర్నూలు : కర్నూలు తాలూకా రూరల్ పీఎస్ సీఐగా నియమితులైన వి.కిరణ్ కుమార్‌రెడ్డి ఆదివారం విధుల్లో చేరారు. ఇక్కడున్న శ్రీనివాసరెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. కడప జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి 2007లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఈయన సర్వీసు మొత్తం అనంతపురం జిల్లాలో విధులు నిర్వహించారు. పామిడిలో విధులు నిర్వహిస్తున్న ఈయనను కర్నూలు రూరల్ తాలూకా సీఐగా నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో విధుల్లో చేరారు. అనంతరం మర్యాదపూర్వకంగా ఆయన ఉన్నతాధికారులను కలిశారు.

### రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న కె. సమన్విత

కర్నూలు (న్యూసిటీ): నగరంలోని సంకల్‌బాగ్ భాష్యం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఓపెన్ కేటగిరీ విభాగంలో మూల సహస్ర లక్ష్మి, ఎం. హేమ న్య, కె. సమన్విత మొదటి మూడుస్థానాల్లో విజయం సాధించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్. కిరణ్‌కుమార్ మెమెంటో, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ నాయకులు కోవింద జియ్యర్, రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్లు స్వాతి, డైరెక్టర్ నందకిశోర్ పాల్గొన్నారు.

### వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అందుబాటులో ఉండాలని విద్యుత్ అధికారులను ఆ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింద స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని, ఇవి మన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చూపాలన్నారు. అయితే పనిచేసే చోట ఉంటేనే సమస్య పరిష్కరించడం సులువన్నారు. ప్రజలకు ఇబ్బందుకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



వడ్డేగేరిలో నాగమయ్యకు పూజలు చేస్తున్న దృశ్యం



లలితా పీఠంలో ప్రత్యేక అలంకారంలో నాగమయ్య

కర్నూలు కల్చరల్: నగర ప్రజలు ఆదివారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లోని నాగమయ్య కట్టలకు, పుట్టలకు నువ్వుల పిండి, కొబ్బెర బెల్లం నైవేద్యంగా పెట్టి, పాలు పోశారు. నూతన వధూవరులు నాగుల కట్టల చుట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసంలో మొదటి పర్వదినం కావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం, నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం, నగరేశ్వర స్వామి ఆలయం, బుధవార పేట నీలకంఠేశ్వర స్వామి ఆలయం, గోశాల, టీటీడీ కళ్యాణ మండపం ఆవరణ, లలితా పీఠం, సప్తగిరి మణికంఠ అయ్యప్పస్వామి ఆలయం, సంకల్ బాగ్‌లలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, అశోక్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయాల్లో భక్తులు సందడి నెలకొంది.



నాగ ప్రతిమకు పాలుపోస్తున్న మహిళ



హంద్రీనది ఒడ్డున నాగులపుట్ట వద్ద భక్తజనం



మెడికల్ కాలేజ్ గ్రౌండ్‌లో నాగుల పుట్టకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

### ఆరుగురు బీఎల్‌ఓల సస్పెన్షన్

కర్నూలు (టౌన్): విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆరుగురు బీఎల్‌ఓలను (బూత్ లెవల్ ఆఫీసర్లను) నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సస్పెండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నగరంలో ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల గుర్తింపు సర్వే చేస్తున్నారు. అయితే సర్వే పట్ల అలసత్వం ప్రదర్శించడం, సర్వే చేపట్టడంలో అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించిన సచివాలయాల ఉద్యోగులు (బీఎల్‌ఓలు) నాగర్జున, నీలి నాగరాజు, హుస్సేన్, కిరణ్మయి, ఎం.రాజు, నరేష్‌లను కమిషనర్ సస్పెండ్ చేస్తు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కల్లూరు: పదేళ్లలో ఒక్కసారి కూడా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోని వారు వెంటనే గ్రామ/వార్డు సచివాలయాల్లో అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు



బాలాజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే సుధాకర్

- వైఎస్ జగన్ వెంటే ప్రజలు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- బాలాజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

కర్నూలు (న్యూటౌన్): వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలిచి అధికారంలోకి వస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఉత్తమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజలున్నారన్నారు. ఆదివారం రాత్రి 39వ వార్డు బాలాజీనగర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వివిధ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి పథకం లబ్ధిని నేరుగా అర్హుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. ఈ నాలుగేళ్ల ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీకి తిరుగులేదన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గిప్సన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అసిఫ్, కరీముల్లా, సయ్యద్ బారీ, రహేమాన్, జాకీర్ హుస్సేన్, మోయిన్, షరీఫ్, రియాజ్, వలి, మగ్బూల్, రఫీక్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## కారు చీకట్లో కాంతి కిరణం నారాయణ గురు



నారాయణ గురు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): బహుజనులకు విద్య అందుబాటులో లేని సమాజంలో విద్య కోసం పోరాడిన మహనీయులు, కారు చీకట్లో కాంతి కిరణం నారాయణ గురు అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. నారాయణ గురు 167వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కార్యాలయంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అధ్యక్షతన ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా నారాయణ గురు పోరాటాలు నిర్వహించారన్నారు. దేవాలయాలనే పాఠశాలలుగా తీర్చి చదువు నేర్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నారాయణ గురు ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తూ తమ ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు చాకలి సరోజ, కమ్మరి లక్ష్మీరాధిక, దూదేకుల షేకున్‌బీ, వరలక్ష్మి, పద్మావతి, సరోజ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## సేవా గుణం కలిగి ఉండాలి



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులు



సందేశమిస్తున్న రామకృష్ణ ప్రభు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు సూచించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, కుటుంబంలోని సంబంధ బాంధవ్యాలను వివరించాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 29 వరకు క్రీడా సంబరాలు



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూసిటీ) : క్రీడా సంబరాలు ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. ఆదివారం స్టేడియంలో కరాటే పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నాగరత్నమయ్య, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు రవికుమార్, ఫయాజ్ అహ్మద్, మహమ్మద్ గౌస్, వ్యాయామ ఉపాధ్యాయురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

**యూనివర్సల్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్**

యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జోహరాపురంలోని ఇండోర్ 19 కే షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించినట్లు మాస్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు. 19కే షటిల్ బ్యాడ్మింటన్ డైరెక్టర్ జాన్ జాకోబ్ మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు కరాటే, ఉషూ, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆరంజ్ బెల్టులు అందజేశారు.

## పోతిరెడ్డిపాడు నుంచి 9వేల క్యూసెక్కుల నీటి సరఫరా



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కొనసాగుతున్న నీటిప్రవాహం

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 9వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో సాయంత్రం 7 గంటల ప్రాంతంలో 859.30 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 858.40 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు ఐదు గేట్ల ద్వారా నిన్నటి వరకు 10వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగగా ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కులు తగ్గినట్లు తెలిపారు. 9 వేల క్యూసెక్కుల నీరు ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 4,000 క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 4,000, కేసీ ఎస్కేప్ కాల్వకు 1,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. శ్రీశైలం జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం నిలిచిపోవటంతో క్రమేణా డ్యాంలో నీటి మట్టం తగ్గుతూ వస్తుంది.

### నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని గణేష్ నగర్ ఏరియాలో చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గణేష్ నగర్, సాయి విజయ్ కాలనీ, రెవె న్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, పార్థసారథి టవర్స్, శ్రీవారి కుటీర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొ న్నారు. ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

### 30న భజన మండళ్ల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: పవిత్ర శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని వికాస భారతి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాల ప్రాంగణంలో భజన మండళ్ల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త పోచా మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజ్యశ్రీ స్వాత్మానంద సరస్వతి స్వామి వారు ఆశీర్వాద ప్రసంగం చేస్తారని తెలిపారు. ఎన్ని భజన మండళ్లు, ఎంత మంది సభ్యులు వస్తున్నారనే వివరాలు ఈనెల 25వ తేదీలోగా 94932 54266 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

### చలో విజయవాడను జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: ఈ నెల 23వ తేదీ నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్.గోకారి, కార్యదర్శి గట్టు తిమ్మప్ప కోరారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ భవనంలో జరిగిన ఫ్యాప్టో అనుబంధ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. టీచర్లకు బదిలీలు, పదోన్నతులు చేపట్టిన మూడు నెలలకేపని సర్దుబాటు చేయడం సమంజసం కాదన్నారు. కస్తూరిబా స్కూళ్లలో పని చేసే టీచర్లకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా 50 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు.

### 30న నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్) : ఈనెల 30 న స్థానిక నగర పాలక నూతన కౌన్సిల్ హాలులో నగర పాలక సర్వసభ్య సమావేశం జరుగనుంది. నగర మేయర్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో పాలక వర్గ సభ్యులు , అధికారులు హాజరు కానున్నారు. పలు అభివృద్ధి అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

### అధునాతన పద్ధతిలో బ్లాస్టింగ్ చేయాలి

కర్నూలు (న్యూసిటీ): మట్టిని తవ్వుకోవడానికి అనుమతులు తీసుకున్న వారు ఎక్కువ శబ్దాలు లేకుండా అధునాతన పద్ధతిలో బ్లాస్టింగ్ చేయాలని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సూచించారు. ఆదివారం హైదరాబాద్ లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో 'మినరల్ అండ్ వాటర్ రిసోర్సెస్ చాలెంజెస్ పర్స్పెక్టివ్' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సెమినార్‌కు ఆయన హాజరయ్యారు. సదస్సు విశేషాలను 'సాక్షి'కి తెలిపా రు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, ఖనిజాల అన్వేషణ, పర్యావరణ సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై సదస్సులో చర్చించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గనులపై సమగ్ర వేదిక అందజేశామని చెప్పారు. సదస్సుల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, బనగానపల్లె మైనింగ్ ఏడీ రాజగోపాల్ పాల్గొన్నారన్నారు.

## సస్యరక్షణపై రైతులకు అవగాహన పెంచండి

- నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటల్లో చేపట్టే సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఏ.రామకృష్ణారావు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుకు సంబంధించి ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ డి.జయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...డీలర్లు సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల కోసం మీ దగ్గరకే వస్తుంటారని, వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని చెప్పారు. రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. పిచికారీలో మోతాదుకు మించి పురుగుమందులు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రసాయనిక పురుగుమందులను పూత మందులు, సూక్ష్మధాతువులతో కలిపి పిచికారీ చేయరాదని తెలిపారు. విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సిఫారస్సుల మేరకే పిచికారీ చేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



మహిళను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పథకాలు అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అశోక్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొందరికి మాత్రమే మంచి జరిగేదని, నేడు అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కుల మతాలు, వర్గాలు చూడకుండా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, షేక్, ఇర్ఫాన్, సాధిక్, జోషిరాజ్, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ

ఒంగోలు: హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జట్టు సత్తాచాటింది. పురుషుల విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఒంగోలులోని మినీ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి 9వ పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్‌మ్యాచ్ జరిగింది. ఈ పోటీలో విశాఖ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, కర్నూలు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆతిథ్య ప్రకాశం జట్టు తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ప్రకటించారు. ఎంపికైన క్రీడాజట్టు సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుంది. అనంతరం పోటీల ముగింపు కార్యక్రమంలో భాగంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జె.కోటేశ్వరరావు, పి.విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ వై.శీనయ్య, పి.విజయ్‌కుమార్, సత్యం, గురుప్రసాద్ తదితరులు పాల్గొని విజేత జట్లకు ట్రోఫీలు అందించారు.

## దినచర్యలో యోగా భాగం కావాలి

- నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (న్యూసిటీ) : విద్యార్థులు దినచర్యలో యోగా సాధన భాగం కావాలని, దీని వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో అవుట్ డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు యోగాను నేర్చుకోవాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు లక్ష్మీ అమ్మ డెవలప్‌మెంట్ యూత్ బెస్ట్ సర్వీస్ సొసైటీ ముందుకు రావడం శుభ పరిణామమని తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. సెప్టెంబర్ 9 నుంచి 10వ తేదీ వరకు జరిగే 48వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కర్నూలు అతిథ్యమివ్వనున్నట్లు రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, జాతీయ యోగా సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి చెప్పారు. జిల్లా స్థాయి యోగా పోటీలకు 550 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో 41వ వార్డు కార్పొరేటర్ శ్వేతారెడ్డి, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో అభివృద్ధి పనుల పరిశీలన



పంచమఠాలను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ ఎస్.లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న పరిశీలించారు. ఆదివారం దేవస్థాన పరిపాలనాంశాల్లో భాగంగా ఘంటామఠం, విభూతిమఠం, గణేశసదనమును ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణలో భాగంగా దేవస్థానం పంచమఠాల పునర్నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేశారు. ఇప్పటికే ఘంటామఠానికి సంబంధించి గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం, విమానగోపుర నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే ఘంటామఠ ప్రాంగాణములోని ఉపాలయాలు కూడా పూర్తి చేశారు. మఠాల ప్రాంగాణం చుట్టు పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. వర్షాకాలం పూర్తయ్యేలోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఘంటామఠంలోని కొమారీదేవి, పాండవ గుహ వద్ద ఉన్న కాలభైరవస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలని, జటావీరభద్రమఠాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. అనంతరం విభూతిమఠంను పరిశీలించి, మఠం చుట్టు గార్డెనింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. టూరిస్ట్ బస్టాండ్ సమీపంలో భక్తుల వసతి కోసం 220 గదుల సముదాయంగా నిర్మించిన గణేశసదనమును తనిఖీ చేసి వెనుక భాగంలో అడవి జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, సీఎస్‌ఓ శివప్రసాద్, డీఈ చంద్రశేఖర శాస్త్రి, సుబ్బారెడ్డి, ఉద్యానవన అధికారి లోకేష్, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర రెడ్డి, ఏఈలు భవన్, విష్ణు, రాజేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.